

ఖందేవుని జాతరకు వేళాయె

ఈ నెల 25వ తేదీ నుంచి మహాపూజతో ఖందేవుని జాతర ప్రారంభమవుతుంది. దేశంలోని తొడసం వంశస్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకోనున్నారు. 10లో▸



ఏసీబీకి పట్టుబడ్డ మున్సిపల్..

నిర్మల్ మున్సిపాలిటీలో పని చేసే ఇద్దరు ఉద్యోగులు రూ.3,500 లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. వారిని కరీంనగర్ లోని ఏసీబీ కోర్టుకు తరలించారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
28.0/16.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలి పెరుగుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అడ్డంకులెదురైనా యాత్ర ఆగదు



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా రాహుల్‌గాంధీ తలపెట్టిన యాత్ర దిగ్విజయంగా ముందుకు సాగుతుందని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు పేర్కొన్నారు. అస్సాంలో ఏఐసీసీ నాయకుడు రాహుల్‌గాంధీ పాదయాత్రను బీజేపీ నాయకులు అడ్డుకోవడంపై జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిరసన చేపట్టారు. స్థానిక గాంధీ పార్క్‌లోని బాపూజీ విగ్రహం ఎదుట బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీపై జరిగిన దాడిని ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా భావిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి దాడులు సరికాదని పేర్కొన్నారు. రాహుల్ యాత్రకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం, గుడి సందర్శనకు అనుమతి ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ధోరణి సరికాదని పేర్కొన్నారు.

హస్తకళామేళ ప్రారంభం



మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఏలేటి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్‌లోగల ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన శ్రీకళాభారతి చేనేత హస్తకళామేళాను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. అనంతరం చేనేత వస్త్రాలను పరిశీలించారు. నాయకులు, కార్యకర్తలున్నారు.

మైనర్లను పనిలో పెట్టుకుంటే చర్యలు

నిర్మల్‌చైన్‌గేట్: మైనర్లను పనిలో పెట్టుకున్న వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా బాలల న్యాయ సలహాదారు షేర్ నరేందర్ హెచ్చరించారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని పలు షాపుల్లో తనిఖీలు చేపట్టారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే ఎంతటి వారినైనా వదిలిపెట్టబోమన్నారు. ఎక్కడైనా ఆపదలో ఉన్న బాలలు కనిపిస్తే 1098 సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీస్ సిబ్బంది అశోక్, షోకాథ్, చిన్నయ్య, నరేశ్, వజ్రమ్మ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.


ఆటలతో మానసికోల్లాసం



క్యారమ్ ఆడుతున్న జడ్జి దేవేంద్రబాబు

భైంసాటౌన్: ఆటలతో మానసికోల్లాసం కలుగుతుందని భైంసా కోర్టు న్యాయమూర్తి డీ దేవేంద్రబాబు పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని కోర్టు ఆవరణలో ఇండోర్ ఆటల పోటీలను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం న్యాయవాదులతో కలిసి క్యారమ్ ఆడారు. ఏపీపీ అరుణ, ఏజీపీ సంతోష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోయిడి రఘువీర్, న్యాయవాది సీ శంకర్ తదితరులున్నారు.

కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

నిర్మల్‌టౌన్: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఇటీవల జరిగిన ఖేల్ ఇండియా వుమెన్స్ కిక్ బాక్సింగ్ లీగ్‌లో సారంగపూర్ మండలం జామ్, సోన్, నర్సాపూర్ (జీ) కేజీబీవీలు, నిర్మల్ వాసవి వరల్డ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఐదు బంగారు, ఆరు వెండి, తొమ్మిది కాంస్య పతకాలు సాధించినట్లు జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చందుల స్వామి, ప్రధాన కార్యదర్శి కిన్నెర మణాళిని తెలిపారు.

కందకాలు ఖతం..

చైన్‌గేట్ వద్ద..

నిత్యం వేలాదిమందితోపాటు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగించే జిల్లాకేంద్రంలోని ప్రధాన రహదారి పక్కనే కందకం క్రమంగా కనుమరుగవుతోంది. నిర్మల్ ముఖద్వారంగా వెలుగొందిన చైన్‌గేట్ పక్కనే ఓ వైపు ఇప్పటికే కందకం చిన్నకాలువగా మార్చేశారు. ఇక ఇంకోవైపూ అదే కథ మొదలైంది. బస్‌డిపో గోడను ఆనుకుని వస్తున్న కందకాన్ని క్రమంగా ఆక్రమిస్తూ వస్తున్నారు. త్వరలోనే ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్న ఓ షాపింగ్‌మాల్ పక్కనే ఉన్నా.. సంబంధిత అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.



చైన్‌గేట్ దగ్గర నూతనంగా నిర్మిస్తున్న ఓ షాపింగ్‌మాల్ వెనుక ఆక్రమణకు గురవుతున్న కందకం

- కళ్లెదుటే ఒక్కొక్కటిగా ఆక్రమణ
- కళ్లు మూసుకున్నట్లుగా వ్యవస్థలు
- క్రమంగా కనుమరుగవుతున్న వైనం
- ఆక్రమణదారులపై చర్యలు శూన్యం
- అసహనం వ్యక్తంజేస్తున్న స్థానికులు

నిర్మల్: 'పేరుకు జిల్లాకేంద్రం. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులంతా ఇక్కడే ఉంటారు. కానీ.. ఏం లాభం సార్..? వాళ్ల కళ్ల ముందే ఇన్ని కబ్జాలు, ఆక్రమణలు జరుగుతున్నా.. ఎవరూ పట్టించుకోరు..' అంటూ నిర్మల్‌వాసులు పెదవి విరుస్తున్నారు. దాదాపు 450ఏళ్లకు పైగా చారిత్రక నేపథ్యమున్న నిర్మల్‌లో కందకాలు, కాలువలు, చారిత్రక కట్టడాలు ఒక్కటేమిటీ.. అన్నీ ఆక్రమణదారుల కబ్జాల్లోకి వెళ్లిపోతున్నాయి. పట్టణంలోని పాతకాలనీల్లో ఇప్పటికే ఒక్కటంటే ఒక్క కందకమూ మిగల్లేదు. ఉన్న జౌళినాలానూ ఆక్రమిస్తూ వస్తున్నారు.

అప్పుడు తవ్విస్తే..

నిమ్మనాయుడి చేతిలో పురుడుపోసుకుని శ్రీనివాసరావు లాంటి ముందుచూపున్న పాలకుల కాలంలో నిర్మల్ ఓ ప్రణాళికాబద్ధంగా నిర్మితమైంది. పట్టణం చుట్టూ ఉన్న రక్షణ గఢ్, బురుజులను ఆనుకుని లోతైన కందకాన్ని తవ్వారు. దీంట్లో అప్పట్లో మంచినీళ్లు, మొసళ్లు ఉండేవని చరిత్ర చెబుతోంది. కనీసం 30అడుగుల వెడల్పుతో ఇవి ఉన్నట్లు తెలుస్తోంది. వీటి ద్వారా రాజ్యరక్షణతోపాటు నిమ్మలలో నీటికి కరువు ఏర్పడకుండా ఉండేలా నిర్మించారు. గొలుసుకట్టు చెరువులు, కందకాల కారణంగానే ఇప్పటికీ నిర్మల్‌లో నీటికరువు అన్న మాట కూడా రాలేదు. అలాంటిది వీటిని కబ్జాలు చేస్తూపోతుంటే.. కరువుకాలం ఎంతో దూరం ఉండదని నిర్మల్‌వాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఫిర్యాదులు వచ్చినా..

జిల్లాకేంద్రంలోని ఎస్సార్ డీజీ స్కూల్ (ప్రభుత్వ ప్రధానాస్పత్రి) వెనుక కందకాన్ని కబ్జా చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. పురావస్తుశాఖకు చెందిన కట్టడాలు, కందకాలను మున్సిపల్‌కు చెందిన కొందరు ఇష్టారీతిన కబ్జాలు చేయడంపైనా ఫిర్యాదు చేశారు. అయినా ఎవరూ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. ఈ విషయమై సంబంధిత అధికారులను వివరణ కోరితే.. జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని చెబుతున్నారు.

కళానగర్‌లో అదే కథ..

జిల్లాకేంద్రంలోని ప్రియదర్శినినగర్‌కు వెళ్లే దారిలో కళానగర్ వద్ద గల కందకం కూడా కబ్జాలతో కనుమరుగవుతోంది. ఇప్పటికే బాలాజీ, బాహుబలి అపార్ట్‌మెంట్లు, వివేక్ స్కూల్, జోహ్రానగర్ వైపు కందకం చిన్నపాటి మురుగు కాలువలా మార్చేశారు. ఇక రోడ్డుపైనే కల్వర్టు పక్కన కందకంలోనే మట్టి పోసి కబ్జా చేసే ప్రయత్నం చేశారు. దీన్ని తొలగిస్తామని అధికారులు చెప్పి ఏళ్లు గడుస్తున్నాయి. దీన్ని చూసి వెనుకవైపు మిగతా ప్లాట్ల వాళ్లు కందకంలోకి చొచ్చుకువచ్చి నిర్మాణాలు చేస్తున్నారు.



కందకాన్ని ఆక్రమిస్తూ పోసిన మట్టి

క్రమక్రమంగా కనుమరుగు..



చైన్‌గేట్ వద్ద డ్రెయినేజీలా మారిన కందకం

నిర్మల్‌లో చాలా తెలివిగా కందకాలను కబ్జా చేస్తున్నారు. ముందుగా కందకాన్ని ఆనుకుని కొంత భూమి చదును చేస్తున్నారు. ఆ తర్వాత అక్కడ చిన్నగా షెడ్డులా వేస్తున్నారు. క్రమంగా దాని వెనుకభాగంలో మట్టి నింపేసి ఆక్రమిస్తున్నారు. కాలక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది చేతులు తడుపుతూ ఆ భూమిని తమపేరిట చేసుకుంటున్నారు. ఈమధ్యకాలంలోనే చేపల మార్కెట్ కాలంలో కందకం ఓ వైపు మొత్తం కనిపించకుండా పోయింది. అక్కడ అక్రమ నిర్మాణాలు వెలిశాయి. సాక్షాత్తు ప్రధాన రహదారిపై చైన్‌గేట్ (బస్‌డిపో) దగ్గర గల కందకాన్ని ఓవైపు నామరూపాలు లేకుండా చేసేశారు. ఇప్పుడు ఇంకోవైపు అదే కథ మొదలుపెట్టారు. క్రమంగా దాన్నీ కబ్జా చేసే పని కొనసాగుతోంది. బస్‌డిపో పక్కన, రిలయన్స్ స్మార్ట్ వెనుక రెండుచోట్లా మట్టిని నింపేస్తున్నారు.

కళ్ల ముందే..



నెలక్రితం నీటితో నిండుగా కందకం

ఈ చిత్రాల్లో మొదటిది నెలక్రితం తీసింది. జిల్లాకేంద్రంలోని ప్రియదర్శినినగర్‌లో ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి వెనుక గజ్‌గఢ్ చుట్టూ ఉన్న కందకమిది. రెండో చిత్రం.. తాజాగా తీసింది. నిండుగా నీటితో ఉన్న చారిత్రక కందకాన్ని ఇలా.. మొరంతో నింపేశారు. ఇదంతా అధికారులు, ప్రజాప్రతినిధుల కళ్లముందే కొనసాగుతోంది. ఏవేవో కారణాలు చెబుతూ చారిత్రక కందకాలను ఖతం చేస్తున్నారు. భూగర్భ జలాలకు ఎసరు పెడుతున్నారు.



ప్రస్తుతం కబ్జా చేసి మట్టి పోయగా ఇలా..

నేటి నుంచి రక్త పరీక్షలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో 8, 9, 10 తరగతులు, ఇంటర్ చదువుతున్న 28,956 మంది విద్యార్థులకు ఈ నెల 24వ తేదీ నుంచి వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు విద్య, సంక్షేమశాఖలతోపాటు మోడల్ బృందాలు సిద్ధమయ్యాయి. ఎనిమిది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ఫార్మసిస్ట్, ఏఎన్ఎంతో పాటు డ్రైవర్‌ను నియమించారు. కార్యక్రమాన్ని రాష్ట్రీయ కిశోర్ స్వస్థ్, రాష్ట్రీయ బాల స్వస్థ్ ద్వారా చేపట్టనున్నారు. ఒక్కో బృందం పాఠశాలకు వెళ్లి రోజుకు 100 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. డిజిటల్ మిషన్ ద్వారా శరీరంలో హిమోగ్లోబిన్ శాతాన్ని నిర్ధారిస్తారు. 8 శాతం కంటే తక్కువగా ఉంటే రక్తహీనత ఉన్నట్లుగా నమోదు చేసుకుంటారు. వీరికి ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలను ఉచితంగా అందిస్తారు. 7 శాతం కంటే తక్కువగా ఉంటే తక్కువ శాతం (మోడ్), ఆరు కంటే తక్కువగా ఉంటే తీవ్రంగా ఉన్నట్లుగా నిర్ధారిస్తారు. వీరిని ఆస్పత్రికి తరలించి రక్తం ఎక్కిస్తారు. అంతే కాకుండా వివిధ రకాల పరీక్షలు చేసి రక్తం తక్కువగా ఉండటానికి గల కారణాలు తెలుసుకుంటారు. క్యాన్సర్, రక్తహీనత, తలసేమియా, బ్లడ్ క్యాన్సర్, సికిల్‌సెల్ లాంటి వ్యాధులుంటే మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు చేపడుతారు. ఈ నెల 24వ తేదీ నుంచి రక్తహీనత పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఎంహెచ్‌వో ధనరాజ్ తెలిపారు. రోజుకు వందమందిని పరీక్షించేలా సమయం కేటాయించామని పేర్కొన్నారు. పన్నెండేళ్లు పైబడిన 8, 9, 10, ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు.

మంత్రిని కలిసిన రైతులు



మంత్రి సీతక్కతో కడెం మండల రైతులు

కడెం: మండలంలోని లింగాపూర్, సారంగపూర్, మాసాయిపేట్, కొత్త మద్దిపడగ, పాత మద్దిపడగ, లక్ష్మీసాగర్, పెత్తర్పు మామల గ్రామాల రైతులు మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను ఉట్నూర్‌లో కలిశారు. యాసంగి పంటలకు సదర్మాట్ నుంచి సాగునీరందించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ.. సదర్‌మాట్ రైతాంగ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నీటి విడుదలపై అధికారులతో మాట్లాడతానని చెప్పారు. ఇందులో నాయకులు ఇందూర్‌నేత, జడ రాజేశ్, ఆయా గ్రామల రైతులున్నారు. అలాగే తమకు సాగునీరు అందించాలని సదర్‌మాట్ ఆయకట్టు రైతులు మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు.

'వుషూ'లో క్రీడాకారులకు పతకాలు



స్వాతి, మాధురితో కోచ్ సాయికృష్ణ

భైంసాటౌన్: తమిళనాడులోని కోయంబత్తూర్‌లో నిర్వహించిన ఖేలో ఇండియా సౌత్ జోన్ వుషూ (ఉమెన్స్) పోటీల్లో జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారులు పతకాలు సాధించినట్లు జిల్లా క్రీడల అధికారి నఫేఖాన్ తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తమిళనాడు ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ మేరకు రాష్ట్రం నుంచి 64 మంది క్రీడాకారులు పాల్గొనగా, జిల్లా నుంచి ఇద్దరు కాంస్య పతకం సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. నలుగురు బెస్ట్ ప్లేయర్స్ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. జూనియర్ విభాగంలో రాథోడ్ స్వాతి (52 కేజీలు), సీనియర్ విభాగంలో బీ మాధురి కియంగ్షు విభాగంలో కాంస్య పతకం సాధించారు. సబ్ జూనియర్ విభాగంలో ఏ నిర్విఘ్న, జే కావేరి, బీ స్వేచ్ఛారెడ్డి, నిఖిత వివిధ స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. ఈ మేరకు పతకాలు సాధించిన క్రీడాకారులను క్రీడల అధికారి నఫేఖాన్, జిల్లా అధ్యక్షుడు నాగేశ్, కోశాధికారి చందుల స్వామి, కోచ్ శ్రీరాముల సాయికృష్ణ అభినందించారు.

లబ్ధిదారులకు చెక్కులు అందజేత



నిర్మల్‌చైన్‌గేట్: చెక్కు ఇస్తున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ పట్టణం, నిర్మల్ రూరల్, నర్సాపూర్ జీ, మామడ, లక్ష్మణచాంద, దిలావర్‌పూర్, సారంగపూర్, సోన్ మండలాలకు చెందిన సుమారు 259 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతీ ఇంటికి చేరేలా కృషి చేస్తానని చెప్పారు. నియోజకవర్గ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నిర్మల్ ఆర్డీవో రత్నకళ్యాణి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కౌన్సిలర్లు, ఆయా మండలాల తహసీల్దార్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనాల ప్రారంభం

మామడ: మండలంలోని కమల్‌కోట్, రాయదారి గ్రామాల్లో రూ.40లక్షల ఉపాధిహామీ నిధులతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో అభివృద్ధి పనులు చేపడతానని హామీ ఇచ్చారు. ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, నిర్మల్ మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, సర్పంచులు ముత్యంరెడ్డి, హరిప్రియభాస్కర్‌రావు, నాయకులు బాపురెడ్డి, రాజారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, రాంరెడ్డి, నరేశ్, ఎంపీడీవో రమేశ్, ఎంపీవో గోవర్ధన్, ఈజీఎస్ ఏపీవో శివాజీ, ఐకేపీ ఏపీఎం అరుణ తదితరులున్నారు.

వంతెన కోసం సర్వే



సర్వే పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్–తర్లపాడ్ మార్గంలో రెంకోని వాగుపై వంతెన నిర్మాణం చేపట్టేందుకు మంగళవారం ఆర్‌అండ్‌బీ అధికారులు సర్వే నిర్వహించారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆర్‌అండ్‌బీ డీఈ మల్లారెడ్డి, ఏఈఈ విజయలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

ప్రజల గుండెల్లో స్థానం పొందాలి

- అభివృద్ధి కోసం మనసు పెట్టి పనిచేయండి
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- ఉట్నూర్‌లో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కైలాస్‌నగర్/ఉట్నూర్‌రూరల్: 'దేవుడు ఎక్కడున్నాడో తెలియదు.. కానీ వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు మనమే దేవుళ్లం.. రాజకీయాల జోలికి వెళ్లకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు మనసు పెట్టి పనిచేయాలి.. ప్రజా సమస్యల పరిష్కారానికి మన వంతుగా కృషి చేద్దాం..' అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ప్రజలకు మంచి చేస్తే ఏ విధంగా గుండెల్లో పెట్టి చూసుకుంటారో హైమండార్ఫ్ నిదర్శనమన్నారు. ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా అధికారులతో బడ్జెట్ అంచనాల రూపకల్పనపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా మారుమూల గ్రామాలు ఇంకా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. పల్లెల్లో తిరిగితే అక్కడ పరిస్థితులను చూసి బాధేస్తుందన్నారు. మన ప్రాంత అభివృద్ధి మన చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు జోడెద్దుల్లా కలిసి పని చేయాలని సూచించారు. వాస్తవాలకు అనుగుణంగా ప్రణాళికలు ఉండాలన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడంతో పాటు వాటిని క్షేత్ర స్థాయిలో ప్రణాళికాబద్ధంగా ఎలా ఖర్చు చేయాలనే దానిపై బాధ్యతగా వ్యవహరించాలన్నారు. గూడేలు, తండాలతో పాటు గుట్టలపై ఉన్న ఆదివాసీలకు అన్ని విధాలా న్యాయం జరగాలన్నారు. ప్రతీ అధికారి తన పరిధిలోని సమస్యను మానవతా దృక్పథంతో పరిష్కరించేలా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రతీ పనికి సంబంధించి వాస్తవాలను వెల్లడించాలన్నారు. ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం సరికాదన్నారు. రాజ్యాంగంపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించేలా పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు క్రీడా పోటీలు కూడా నిర్వహించాలని సూచించారు. అంతకుముందు కేబీ కాంప్లెక్స్‌కు చేరుకున్న మంత్రికి అధికారులు పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. కుమురంభీం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, పాయల్ శంకర్, జాదవ్ అనిల్‌కుమార్, గడ్డం వినోద్, కోవ లక్ష్మి, పాల్వాయి హరీశ్‌బాబు, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం జిల్లాల కలెక్టర్లు రాహుల్‌రాజ్, బాదావత్ సంతోష్, ఆశిష్ సాంగ్వాన్, హేమంత్ బోర్కడే, ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డీఎఫ్‌వోలు ప్రశాంత్ బాజీరావు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

అసమానతల తొలగింపునకు కృషి



ఖానాపూర్‌లో విన్యాసం ప్రదర్శిస్తున్న కీర్తన

ఖానాపూర్: సైన్స్ ద్వారానే సమాజంలో అసమానతల తొలగింపు సాధ్యమవుతుందని, ఆ దిశగా తమ సంస్థ ప్రత్యేక కృషి చేస్తోందని సిమ్సన్ ఫార్మా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పెంచాల సత్యనారాయణరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మస్కాపూర్ జెడ్పీఎస్ఎస్‌తో పాటు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో సిమ్సన్‌తో పాటు నోబెల్ ఎడ్యుకేషన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్‌లను ప్రారంభించి మాట్లాడారు. సీస్సార్ కార్యక్రమంలో భాగంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో నోబెల్ ఎడ్యుకేషన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ ద్వారా మస్కాపూర్ పాఠశాలకు 10 కంప్యూటర్లు, 10 టేబుళ్లు, 20 కుర్చీలు, 32 ఇంచుల ఎల్‌ఈడీ టీవీ అందజేసినట్లు పేర్కొన్నారు. ఖానాపూర్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలోనూ అందించామని చెప్పారు. రెండు పాఠశాలల్లో కంప్యూటర్ విద్య అందించాలనే ఉద్దేశంతో రూ.6లక్షలకు పైగా వెచ్చించామని తెలిపారు. తమ వద్ద ఇప్పటివరకు 350 మంది శాస్త్రవేత్తలున్నారని, ఇంకా 2వేల మందిని తయారు చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. త్వరలో రెండు పాఠశాలల్లోనూ కెమిస్ట్రీ, ఫిజిక్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కరీంనగర్ ఏసీపీ కరుణాకర్‌రావు మాట్లాడుతూ.. తన స్వగ్రామమైన ఖానాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్లు ఏర్పాటు చేయాలని తాను కోరగా వెంటనే ఎండీ సత్యనారాయణరావు స్పందించారని తెలిపారు. ఆయనను అభినందించారు. విద్యార్థి దశలో కష్టపడి చదివితేనే ఉన్నత స్థాయిలో రాణిస్తారని పేర్కొన్నారు. కాగా, బాలికల పాఠశాలకు చెందిన డ్రాపౌట్ చిన్నారి కీర్తన చేసిన విన్యాసాలు బాగున్నాయని, ఆమె చదువుకు తనవంతు చేయూతనిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దంతూరి సురేశ్, తోపె రాధాకృష్ణ, అడిదెల మహేందర్, స్వప్న, రాజేందర్, సత్యం, మాజీద్, సాగర్, శివ, ఉపేందర్, షబ్బీర్‌పాషా, చంద్రశేఖర్‌రావు, శ్రీనివాస్‌రావు, సుదర్శన్, వెంకటేశ్వర్లు, నరేందర్‌రెడ్డి, సంధ్యారాణి, నరేందర్‌రావు, జాడి శ్రీనివాస్, అంజయ్య తదితరులున్నారు.

క్లుప్తంగా

దాడికేసులో ఒకరికి మూడు నెలల జైలు

భైంసాటౌన్: కుభీర్ మండల కేంద్రానికి చెందిన అల్కే భోజన్న అనే వ్యక్తికి మూడునెలల జైలు శిక్ష విధిస్తూ భైంసా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి డి.దేవేంద్రబాబు మంగళవారం తీర్పు వెలువరించారు. 6 జనవరి 2017లో కుభీర్ మండల కేంద్రానికి చెందిన అల్కే భోజన్న అదే గ్రామానికి చెందిన అల్కే చిన్నన్నపై గాజు సీసాముక్కతో దాడి చేశాడు. దీంతో కుభీర్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి భార్య కమల ఫిర్యాదు చేసింది. భైంసా కోర్టులో కేసు విచారణకు రాగా ఏపీపీ అరుణ 9 మంది సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో భోజన్నకు మూడునెలల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

'ఎక్సైజ్ సీఐపై చర్యలు తీసుకోవాలి'

ఖానాపూర్: వరంగల్ జిల్లా జన్‌పాక ప్రాంతంలో బతుకుతెరువు కోసం వచ్చి నివసిస్తున్న గిరిజన మహిళ తేజావత్ బుజ్జిని కులం పేరుతో దూషించిన ఎక్సైజ్ సీఐ రమేష్‌చంద్రపై చర్యలు తీసుకోవాలని లంబాడా హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఐతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు, డ్రైవర్ నడిరోడ్డుపై మహిళను నానా బూతులు తిడుతూ విచక్షణరహితంగా కొట్టడం సరికాదన్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేసి బాధ్యులైన అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

వైద్యుడి నిర్లక్ష్యం.. మహిళ కాలికి ఇన్ఫెక్షన్.!

భైంసాటౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యుడి నిర్లక్ష్యంతో ఓ మహిళ కాలికి ఇన్ఫెక్షన్ అయింది. బాధితురాలి భర్త విఠల్ తెలిపిన వివరాల ప్రకారం.. రాహుల్‌నగర్‌కు చెందిన లావణ్య ఏడాది కిందట ఇంట్లో మెట్లపై నుంచి జారి కిందపడగా కాలు విరిగింది. దీంతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకుంది. ఆపరేషన్ సమయంలో వేసిన రాడ్ తీయించునేందుకు నెలరోజుల కింద మరో ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. కాగా ఆపరేషన్ చేసిన సదరు వైద్యుడు రాడ్ తొలగించి వాచర్ మరిచినట్లు విఠల్ ఆరోపించారు. కాలుకు ఇన్ఫెక్షన్ రావడంతో ఇటీవల నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చూయించగా కాలులో వాచర్ ఉన్నట్లు గుర్తించి ఆపరేషన్ చేసి తొలగించారన్నారు. సదరు వైద్యుడిని ఈ విషయమై నిలదీయగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు పేర్కొన్నారు. 'సాక్షి' సైతం ఫోన్‌లో వివరణ కోరగా, ఆపరేషన్ సమయంలో బాధితురాలి పరిస్థితి మెరుగ్గానే ఉందని, తమ తప్పు లేదని తెలిపారు.

హామీలు నిలబెట్టుకోవాలి



పాల్గొన్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: లోకసభ ఎన్నికలలోపు సీసీఐని పునఃప్రారంభించి గత ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆదిలాబాద్ నుండి ఆర్మూర్ వరకు రైల్వేలైన్‌కు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి పనులు చేపట్టాలని, జిల్లాలో విమానశ్రయం, సిమెంట్ ఫ్యాక్టరీ పరిశ్రమను తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు బండి దత్తాత్రి, దర్శనాల మల్లేశ్, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, సీపీఐ నాయకులు ప్రభాకర్ రెడ్డి, టీఎస్‌జీవోస్ నాయకులు అశోక్, టీఆర్ఎస్ నాయకులు నారాయణ, ప్రజా సంఘాల నాయకులు సంజీవ్‌రెడ్డి ఉన్నారు.

ఖందేవుని జాతరకు వేళాయె

- నేడు మాన్కాపూర్ వద్ద మాసేమాల్ పేన్ దేవతకు పూజలు
- 25న ఖందేవునికి తొడసం వంశస్తుల పూజ
- 26న నూనె తాగనున్న తొడసం ఆడపడుచు
- ఫిబ్రవరి 8 వరకు కొనసాగనున్న జాతర

ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లు... వారి ఆచార వ్యవహారాలు నేటి ఆధునిక యుగంలోనూ పాటిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగానే ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని ఖందేవుని జాతర ఓ ప్రత్యేకత.. ఈ నెల 25న ఖందేవుని మహాపూజతో జాతర ప్రారంభం కానుంది. పదిహేను రోజుల పాటు నిర్వహించే ఈ జాతరకు దేశంలోని ఆదిమ గిరిజనులైన తొడసం వంశస్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకోనున్నారు. – నార్నూర్



ఖందేవ్ ఆలయం

మాసేమాల్‌పేన్ పూజలతో మొదలు...

24న బుధవారం రాత్రి మాన్కాపూర్ గ్రామంలో మాసేమాల్ పేన్ దేవతకు తొడసం వంశస్తులు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం అక్కడి నుంచి 25న గురువారం రాత్రి దేశంలోని నలుమూలల నుంచి తరలివచ్చిన తొడసం వంశస్తులు ఖందేవ్ క్షేత్రానికి చేరుకుంటారు. రాత్రి వారి ఆచారం ప్రకారం ఖందేవునికి పుష్య పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 26న శుక్రవారం ఖందేవ్ ఆలయం సన్నిధిలో తొడసం వంశానికి చెందిన ఆడపడుచు నాగుబాయి చందు (కడోడ, గిత్తకు చెందిన) తొడసం వంశంలోని ఇళ్ల నుంచి సేకరించిన రెండు కిలోలకుపైగా నువ్వులతో తయారు చేసిన నూనెతాగి తమ రెండో మొక్కును తీర్చుకోనుందని తొడసం కమిటీ సభ్యులు తెలిపారు.

ఆలయం చరిత్ర...

94 ఏళ్ల క్రితం నార్నూర్ గ్రామంగా మారినప్పుడు ఈ ప్రాంతం అంత దట్టమైన అడవులు, గుట్టలు, కొండలు, భయంకరమైన మృగాలతో ఉండేది. ఈ గ్రామానికి చెందిన తొడసం ఖమ్ము పటేల్ నిద్రలో ఖందేవుడు వచ్చి గ్రామం శాంతియుతంగా ఉండాలంటే తనను ఆరాధ్య దైవంగా స్వీకరించమని చెప్పాడు. మరుసటి రోజు ఖమ్ము పటేల్ తెల్లవారుజామునా లేచి నలుగురు గ్రామ పెద్దలను తీసుకుని వ్యవసాయ క్షేత్రానికి వెళ్లగా కలలో చెప్పిన స్థలంలో ఖందేవుడు ఓ స్తంభంలా వెలిసి కనిపించాడని తొడసం వంశస్తులు చెబుతున్నారు. అయితే ఆ రోజు పౌష్య పౌర్ణమి కావడంతో అప్పటి నుంచి ప్రతీ పౌర్ణమికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులను తీర్చుకుంటారు.

నువ్వుల నూనె తాగడం...

ప్రత్యేక పూజల అనంతరం 26న ఉదయం దేవుని సన్నిధిలో తొడసం వంశానికి చెందిన ఆడపడుచు రెండు కిలోల నువ్వుల నూనె తాగడం ఆనవాయితీ. ఒకరే మూడేళ్ల నూనె తాగాల్సి ఉంటుంది. ఆడపడుచు నాగుబాయి నూనె తాగి రెండో మొక్కును తీర్చుకోనుంది. ఇలా తాగడంతో సంతానం లేదా ఏదైనా మంచి జరుగుతుందని వారి నమ్మకం.

26న దర్బార్, సంప్రదాయ భేటీ...

తొడసం వంశస్తులు మహాపూజ, సంప్రదాయ మొక్కులు చెల్లించిన అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన తొడసం వంశస్తులు ఒక దగ్గరకు చేరుకొని సంప్రదాయ భేటీ నిర్వహిస్తారు. ఆలయ అభివృద్ధితో పాటు సంస్కృతి, సాంప్రదాయల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తారు. అనంతరం ఆలయం ఆవరణంలో మినీ ప్రజాదర్బార్‌ను నిర్వహించి సమస్యలను వివరిస్తారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యేలతో పాటు ప్రజాప్రతినిధులు తరలివస్తారు. అయితే ఆలయ కమిటీ సహకారంతో తొడసం వంశ పెద్దలు తొడసం బాపురావు కటోడ, తొడసం ఆనందరావు కటోడ, రాజు పటేల్, తెలంగాణరావు పటేల్, తొడసం నాగోరావు, స్థానిక సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్‌ల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

తొడసం విజయంగా ఏనుగు విగ్రహం...

ధృవరాజులు వారి పాలనలో ఏనుగులను యుద్ధం సమయంలో ఉపయోగించేవారు. రాజ్యంలో ఏనుగులు ప్రజల పంటలను ధ్వంసం చేయడంతో పాటు ఇబ్బందులకు గురిచేయడంతో వాటిని పట్టుకోవడానికి బహుమతి ప్రకటన చేశారు. తొడసం వంశస్తులు ప్రస్తుతం గాదిగూడ మండలంలోని రోమన్‌కాసా (అప్పటి గోండ్వానా రాజ్యంలో ఉన్న ఎనికాసా) గ్రామం వద్ద ఏనుగులు నిద్రపోతున్న సమయంలో పట్టుకుని ఖందేవ్ పుణ్య క్షేత్రం సమీపంలో చింతచెట్టు వద్ద కట్టేశారు. దీంతో ఆత్రం వంశానికి చెందిన రాజు ''సవ్వ చాలీస్'' రాజ్యాన్ని తొడసం వంశానికి అప్పగించాడు. అప్పటి నుంచి ఏనుగును తొడసం వంశానికి విజయంగా భావిస్తూ ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

సంస్కృతిని కాపాడాలి



తరతరాల నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడాలి. నియమనిష్టలతో ఖందేవునికి పూజలు చేయడం జరుగుతుంది. దేశంలో ఎక్కడ ఉన్న సరే తొడసం వంశస్తులు ఇక్కడికి రావాల్సిందే. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుంది. మహాపూజ, జాతర నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

– తొడసం బాపురావు, కటోడ

ఆనవాయితీగా వస్తుంది



మాతాతల కాలం నుంచి మా వంశ దేవుడైన ఖందేవునికి పుష్య పౌర్ణమి సందర్భంగా పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. మా సంస్కృతి, సాంప్రదాయం ప్రకారం మొక్కులు తీర్చుకుంటాం. జాతరను విజయవంతం చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలి.

– తొడసం తెలంగాణరావు పటేల్

భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు



తొడసం వంశానికి చెందిన ఖందేవుని పూజ కోసం అందరి సహకారంతో అన్ని రకాల ఏర్పాట్లు చేశాం. ప్రతీ ఏడాది పుష్య పౌర్ణమి సందర్భంగా ఆనవాయితీ ప్రకారం పూజలు చేస్తాం. తొడసం వంశానికి చెందిన ఆడపడుచు నువ్వుల నూనె తాగి మొక్కు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

– తొడసం నాగోరావు, ఆలయ కమిటీ సభ్యుడు

ఫారెస్ట్ అధికారులకు నెమళ్ల అప్పగింత



నెమళ్లను అప్పగిస్తున్న రమేశ్, నరేశ్

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామ అటవీ ప్రాంతంలో నిస్సాయ స్థితిలోని రెండు జాతీయ పక్షులను మేకల కాపరులు కావటి రమేష్ యాదవ్, నరేష్ యాదవ్‌ల కంటపడ్డాయి. దీంతో వెంటనే వారు ఫారెస్ట్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు ముత్నూర్ గ్రామానికి చేరుకోగా వారికి అప్పగించారు. దీంతో పశువుల కాపరులను అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు దుర్వ రజని, జ్యోతి, రాజేశ్వరి, ముత్నూర్ గ్రామస్తులు దుర్వ సంతోష్, దుర్వ సంజీవ్ ఉన్నారు.

ఎనిమిది మందికి జరిమానా



వాహనదారులకు సూచనలిస్తున్న ట్రాఫిక్ ఎస్సై

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఎనిమిది మందికి జరిమానా విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పలువురు పట్టుబడగా వారిని నిర్మల్ కోర్టులో హాజరుపరిచారు. ఎనిమిది మందికి రూ.6100 జరిమానా విధిస్తూ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి తీర్పునిచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం కావద్దని ట్రాఫిక్ ఎస్సై పేర్కొన్నారు. ఇందులో ట్రాఫిక్ ఎస్సై సాయికృష్ణ, సిబ్బంది ఉన్నారు.

గల్ఫ్‌కార్మికులకు పునరావాసం కల్పించాలి

- ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికి పండ్ల
- అంతర్జాతీయ కార్మిక సమాఖ్య (ఐఓఎల్ఓ)కు నివేదిక



మాట్లాడుతున్న స్వదేశ్

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ నుంచి గల్ఫ్ దేశాలకు పెద్ద ఎత్తున ఉపాధి కోసం వలస వెళ్లి తిరిగి స్వస్థలాలకు వస్తున్న అంతర్జాతీయ రిటర్నీ వలస కార్మికుల కోసం పునరావాసం కల్పించేలా చర్యలు చేపట్టాలని ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికి పండ్ల అన్నారు. నిర్మల్ జిల్లాకు చెందిన స్వదేశ్ మంగళవారం హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో అంతర్జాతీయ కార్మిక సమాఖ్య(ఐఓఎల్ఓ) ఏర్పాటు చేసిన సమావేశంలో యూనియన్ సలహాదారు టి.సంపత్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కొలంబో ప్రాసెస్-2003 విధానాల ప్రకారం కార్మికులను పంపే దేశాలు, కార్మికులను పనికి తీసుకొనే దేశాల మధ్య ఉన్న ఒప్పందాలను అమలు చేయాలని సూచించారు. గల్ఫ్ దేశాల నుంచి ఘర్‌వాపస్ వచ్చిన కార్మికులకు తగిన కౌన్సెలింగ్ ద్వారా వారికనుగుణంగా నైపుణ్య శిక్షణ, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఐఎల్‌వో అధికారి అమిష్ కార్కి మాట్లాడుతూ.. జిల్లాస్థాయిలో మైగ్రేషన్ రిసోర్స్ సెంటర్ల ద్వారా గల్ఫ్ నుండి తిరిగివచ్చిన కార్మికుల సమగ్ర సమాచారాన్ని సేకరించి తగిన ప్రత్యామ్నాయ మార్గాలద్వారా ఉపాధి కల్పించేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో తెలంగాణ కార్మిక, ఉపాధి శాఖ, టామ్‌కామ్, టాస్క్, కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ఎన్ఆర్ఐ చైర్మన్ అంబాసిడర్ బి.ఎమ్.వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన మున్సిపల్ ఉద్యోగులు

- ఆర్వో గంగాధర్, బిల్ కలెక్టర్ నవంత్
- అదుపులోకి తీసుకున్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి



పట్టుబడిన ఆర్వో గంగాధర్, బిల్ కలెక్టర్ నవంత్

నిర్మల్‌టౌన్: నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు మంగళవారం పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి వివరాల ప్రకారం... పట్టణంలోని ఏఎన్ రెడ్డి కాలనీకి చెందిన వెల్మ గోపాల్‌రెడ్డి నూతనంగా ఇంటిని నిర్మించుకునేందుకు మున్సిపల్ కార్యాలయం నుంచి 2018లో పర్మిషన్ తీసుకున్నాడు. 2023 జనవరిలో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేశాడు. ఇంటి నంబర్ కోసం జులైలో మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. ప్రతీ నెల రెండు సార్లు కార్యాలయానికి వెళ్లినా తన ఇంటి నంబర్ రావడం లేదని అధికారులను కలిశాడు. ఇంటి నంబర్ రావాలంటే రూ.5వేల లంచం ఇవ్వాలని బిల్ కలెక్టర్ నవంత్ డిమాండ్ చేశాడు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారి గంగాధర్‌కు చెప్పాడు. చివరకు రూ.3500 ఇచ్చి మీ పని చేయించుకోవాలని గోపాల్‌రెడ్డికి తెలిపాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను జనవరి 4వ తేదీన సంప్రదించాడు. ఈ క్రమంలో మంగళవారం రూ.3500 లంచం ఇస్తుండగా.. బిల్ కలెక్టర్ నవంత్, రెవెన్యూ అధికారి గంగాధర్‌లను రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి కరీంనగర్‌లోని ఏసీబీ స్పెషల్ కోర్టుకు తరలించినట్లు వెల్లడించారు. ఎవరైనా లంచాల కోసం వేదిస్తే 9154388963 ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయాలని డీఎస్పీ రమణమూర్తి సూచించారు. ఇందులో ఏసీబీ ఇన్‌స్పెక్టర్ జాన్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

లంగ్డాపూర్‌లో చెట్టు నుంచి నీరు



చెట్టును పరిశీలిస్తున్న గ్రామస్తులు

నిర్మల్‌రూరల్: మండలంలోని లంగ్డాపూర్ గ్రామంలో మంగళవారం ఓ వింత చోటుచేసుకుంది. గ్రామంలోని హనుమాన్ మందిరం ఆవరణలో ఉన్న ఓ చెట్టు నుంచి రెండు రోజులుగా నీరు వస్తోంది. దీంతో గ్రామస్తులు, భక్తులు ఆ వింతను చూసేందుకు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ఆలయం ఆవరణలో మర్రిచెట్టు, మేడి చెట్టు , జీవ్వి చెట్టు కలిసి ఉన్నాయి. ఈ చెట్టు నుంచే నీరు ధారలాగా వస్తోంది. ఆలయ ప్రాంగణంలో చెట్టు ఉండడంతో భక్తితో చెట్టుకు పూజలు నిర్వహిస్తున్నారు. చెట్టు నుంచి నీరు రావడం వెనుక కారణాలు తెలియాల్సి ఉంది.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కుంటాల: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని టీజీబీ రాష్ట్ర చైర్మన్ శోభ పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం కుంటాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జన్‌ధన్, పీఎం ఉజ్వల యోజన, కిసాన్ క్రెడిట్ కార్డ్ తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలను ఎల్ఈడీ తెర ద్వారా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఎం డీపీఎస్ రామారావు, ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, సర్పంచ్ సమతా వెంకటేష్, ఎల్డీఎం చంద్రశేఖర్, బీఎం సంతోష్, ఏపీఎం అశోక్, బ్యాంక్ సిబ్బంది వెంకటేష్, సుమలత, ప్రభాకర్, కోటేశ్వరరావు, విక్రం, భోజారాం పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం

- కష్టపడిన వారికే పార్టీలో ప్రాధాన్యం
- ఎన్నికల ముందు హడావుడి చేస్తున్నారు
- ఎంపీ సోయం బాపూరావు వ్యాఖ్యలు
- పట్టణంలో బీజేపీ పార్లమెంట్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ

ఆదిలాబాద్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించిన ఆదిలాబాద్ పార్లమెంట్ బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తోందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలలో బీజేపీ ఈసారి 350 కన్నా అత్యధిక సీట్లను గెలుపొందుతుందన్నారు. ఆదిలాబాద్ స్థానంలో సైతం భారీ మెజారిటీతో బీజేపీ విజయం సాధిస్తుందన్నారు. ప్రజల 500 ఏళ్ల కలను అయోధ్య రామ నిర్మాణంతో సాకారం చేసిందని, ఆర్టికల్ 370 రద్దు వంటి నిర్ణయాలను సైతం తీసుకుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో కొందరు నేతలు హడావుడి చేస్తున్నారని వ్యాఖ్యానించారు. బీజేపీలో ముందు నుంచి కష్టపడిన వారికే ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. ఆదిలాబాద్- ఆర్మూర్ రైల్వే లైన్ ఏర్పాటు పేరుతో కొందరు నిరసనలు చేస్తూ కొత్త నాటకానికి తెరలేపారని మండిపడ్డారు. కొందరు కాంగ్రెస్ నాయకులు తెర వెనుక ఉండి వారితో ఈ ఆందోళనలు నిర్వహించేలా ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ఆదిలాబాద్- ఆర్మూర్ రైల్వే లైన్ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఆలస్యమైందని, ఆదిలాబాద్- పటాన్ చెరు రైల్వే లైన్ నిర్మాణం జరుగుతుందన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ నిరంతరం సమావేశాలు నిర్వహిస్తూ ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని ముందుకు సాగాలన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయమే శిరోధార్యం అన్నారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ విజయం ఖాయమన్నారు. ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పాటిల్ మాట్లాడుతూ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు నిరంతరం కష్టపడాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్ సింగ్, మాజీ ఎంపీ రమేష్ రాథోడ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, నాయకులు అయ్యన్న గారి భూమయ్య, రావుల రామనాథ్, బద్దంలింగారెడ్డి, అల్జాపూర్ శ్రీనివాస్ ఉన్నారు.

ఆదివాసీ యువకుడిపై అటవీశాఖ అధికారుల దాడి

నేరడిగొండ: ఆదివాసీ యువకుడిని అటవీశాఖ అధికారులు చితకబాదిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. నేరడిగొండ మండలంలోని చించోలి గ్రామానికి చెందిన కుడ్మెత రాము సోమవారం సాయంత్రం తన వ్యవసాయ పనుల నిమిత్తం పంట చేనుకు వెళ్లాడు. ఎద్దులను మేపుతుండగా, అటవీ శాఖ అధికారులు వచ్చి దాడి చేశారని, ఎందుకని ప్రశ్నించగా ఎఫ్ఎస్ఓ సుందర్, ఎఫ్ఆర్ఓ ప్రణయ్‌లు వినిపించుకోకుండా గాయపర్చారని బాధితుడు తెలిపాడు. అయితే సోమవారం రాత్రి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు సైతం ఈ విషయాన్ని తెలియజేశారు. ఇదిలా ఉండగా ఎఫ్‌బీఓ మహేష్ కుంటాల సోమన్న హరితవనంలో రోజులాగా గస్తీలో భాగంగా వెళ్లినట్లు ఫిర్యాదు చేశాడు. అయితే రాము వనంలో ఎద్దులను మేపుతుండగా పలుమార్లు చెప్పినా వినిపించుకోలేదని, జీపులో తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా తనపై దాడి చేశాడని ఫిర్యాదులో ఎఫ్‌బీవో మహేష్ పేర్కొన్నారు. ఇలా ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఏదేమైనా ఆదివాసీ యువకుడిపై అటవీ శాఖ అధికారులు దాడి చేయడం సరికాదని పలువురు ఆదివాసీ నాయకులు పేర్కొంటున్నారు.

కుమారి గ్రామవాసికి పీహెచ్‌డీ



పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న దేవేందర్

నేరడిగొండ: ఆదిలాబాద్ జిల్లాలోని గబ్బిలాల విస్తరణ, వాటిస్థితి, ఆదరణ వ్యవస్థపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్య శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండలంలోని కుమారి గ్రామానికి చెందిన గుండేన దేవేందర్ పరిశోధన చేశారు. పీహెచ్‌డీ పట్టా పొందిన ఆయనను కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు అభినందించారు.

దుకాణంలో అగ్నిప్రమాదం..



పరిశీలిస్తున్న జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన శ్యామల వేణుగోపాల్‌రెడ్డి అనే వ్యక్తికి చెందిన కమర్షియల్ కాంప్లెక్స్‌లోని ఓ గదిలో మంగళవారం ఉదయం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం వేణుగోపాల్‌రెడ్డి మడిగెలో నేరడిగొండ మండలం, రాజూరా గ్రామానికి చెందిన పెరియా నారసోడ్ అనే వ్యక్తి కూరగాయాల విక్రయం, పెట్రోలు, డీజిల్ విక్రయించే దుకాణం నడుపుతున్నాడు. ఈ క్రమంలో ఉదయాన్నే షాపుకు చేరుకున్న నారసోడ్ దుకాణంలో పూజ చేసి దీపం వెలిగించాడు. ఇంతలోనే ప్రమాదవశాత్తు పెట్రోల్‌కు నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో నారసోడ్‌కు స్వల్ప గాయాలు కాగా స్థానికులు 108లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు గ్రామానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఒకగది పూర్తిగా కాలిపోగా రూ.2లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. అయితేపక్కనే పోస్టాఫీస్ ఉన్న గదికి మంటలు వ్యాపించకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేశ్వర్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెరియార్ నారసోడ్‌ను పరామర్శించారు. అక్రమంగా పెట్రోల్, డీజిల్ విక్రయిస్తున్న నారసోడ్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

పొట్టపెల్లి పంచాయతీ కార్యదర్శిపై విచారణ



విచారణ చేపడుతున్న ఎంపీవో నసీరుద్దీన్

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి (కే) గ్రామ పంచాయతీ జూనియర్ పంచాయతీ కార్యదర్శిపై విచారణ చేపట్టారు. ఇటీవల మండలంలోని పొట్టపెల్లికే గ్రామాన్ని నిర్మల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు యువకులు తమ గ్రామ జూనియర్ పంచాయతీ కార్యదర్శి ప్రవర్తన సరిగా లేదని, తక్షణమే బదిలీ చేయాలని వినతిపత్రం అందచేశారు. దీంతో అడిషనల్ కలెక్టర్ వెంటనే విచారణ చేసి నివేదిక సమర్పించాలని డీపీవోను ఆదేశించారు. దీంతో డీపీవో శ్రీలత మండల పంచాయతీ అధికారి నసీరుద్దీన్‌ను విచారణ అధికారిగా నియమించారు. మంగళవారం గ్రామ సర్పంచ్ వుల్వాజి హైమావతి అధ్యక్షతన విచారణ చేపట్టారు. ఆ గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామస్తులతో మర్యాదగా ఉంటానని చెప్పడంతో గ్రామస్తులు అంగీకరించారు. దీంతో తమకేమి అభ్యంతరం లేదని స్థానికులు లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు.

వాట్సాప్‌లో ఎస్‌బీఐ యాప్ చక్కర్లు

బోథ్: వాట్సాప్‌లో ఎస్బీఐకి సంబంధించిన ఓ మెసేజ్, ఓ యాప్ చక్కర్లు కొడుతోంది. వివిధ గ్రూపుల్లో ఎస్బీఐ పేరిట షేర్ అవుతోంది. 'డియర్ కస్టమర్, మీ అకౌంట్ ఈ రోజు సస్పెండ్ అవుతుంది, మీ పాన్ కార్డు అప్డేట్ చేసుకోవాలని, పాన్‌కార్డు అప్డేట్ చేసుకోవాలంటే ఎస్బీఐ యాప్‌ను ఓపెన్ చేసి పాన్‌కార్డును లింక్ చేసుకోవాలంటూ మెసేజ్‌తో పాటు యాప్ గ్రూపుల్లో షేర్ అవుతోంది.' ఇలాంటి మెసేజ్‌లు వస్తే యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవద్దని ఎస్బీఐ అధికారులు, పోలీసులు పేర్కొంటున్నారు. దీంతో అకౌంట్ హ్యాక్ అయ్యే అవకాశాలు ఉన్నాయని, గ్రూప్ అడ్మిన్లు వెంటనే మెసెజ్‌తో పాటు యాప్‌ను డిలీట్ చేయాలని సూచిస్తున్నారు. సైబర్ క్రైమ్ జరిగే అవకాశం ఉన్నందున్న జాగ్రత్తగా ఉండాలని పేర్కొంటున్నారు. బోథ్ మండలంలోని వివిధ వాట్సాప్ గ్రూపుల్లో యాప్ షేర్ అవుతోంది.